క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

విజయనగరం: నగరంలోని అంబటిసత్రం జంక్షన్ నుంచి కొత్తపేట నీళ్లట్యాంక్ వరకు చేపడుతున్న రహదారి విస్తరణ పనుల్లో భాగంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు పూల్‌బాగ్ 11 కేవీ ఫీడర్ పరిధిలో గల చిన్నపల్లివారి వీధి, కోలగట్లవారి వీధి, 2 టౌన్ పోలీస్ స్టేషన్, సౌత్ ఇండియా షాపింగ్‌మాల్, కొణిసి వీధి ప్రాంతాల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేటి నుంచి స్వభావ స్వచ్ఛత - సంస్కార స్వచ్ఛత

● కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ సరిత

విజయనగరం: గాంధీ జయంతిని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు స్వభావ స్వచ్ఛత - సంస్కార స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17 నుంచి వచ్చే నెల రెండు వరకు పర్యావరణ అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ డాక్టర్ బిబి.సరిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల నిషేధంపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, హెచ్‌బీఎల్ లిమిటెడ్ బ్యాటరీ వ్యర్థాల రీసైక్లింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా విరివిగా మొక్కలు నాటే కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమాల్లో విద్యార్థులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అన్న సమారాధన


అన్నదానంలో పాల్గొన్న భక్తులు

డెంకాడ: మండలంలోని డెంకాడ గ్రామంలో వినాయక ఉత్సవంలో భాగంగా సోమవారం అన్నదానం నిర్వహించారు. డెంకాడ పీఏసీఎస్ చైర్మన్ రొంగలి కనకసింహాచలం, సర్పంచ్ పతివాడ గౌరి, తదితరులు కార్యక్రమాన్ని ప్రారంభించగా.. వందలాది మంది భక్తులు పాల్గొని స్వామి ప్రసాదం స్వీకరించారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలి

● ఆస్ట్రేలియన్ ప్రొఫెసర్ మార్క్ హెల్త్


సెంచూరియన్‌లో ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ప్రొఫెసర్ మార్క్ హెల్త్

నెల్లిమర్ల రూరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆస్ట్రేలియాలోని మోనాష్ విశ్వ విద్యాలయం రూరల్ హెల్త్ ప్రొఫెసర్ మార్క్‌హెల్త్ ఆకాంక్షించారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ల్యాబ్స్, ఆప్టోమెట్రీ, రేడియాలజీ, అనాటమీ, ఈ-ఆటోల తయారీ, జైరో ప్లేన్, ఏఆర్ వీఆర్ ల్యాబ్, కుట్టు యంత్రాల యూనిట్, తదితర విభాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో సెంచూరియన్ ఉపాధ్యక్షుడు డీఎన్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఎంఎస్ సుబ్బలక్ష్మి జయంతి


సుబ్బలక్ష్మి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

విజయనగరం టౌన్: పట్టణంలోని కొత్త అగ్రహారంలో ఉన్న రోటరీ దశగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీలో ఎంఎస్.సుబ్బలక్ష్మి 108వ జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. ద్వారం నరసింగరావు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అధ్యక్షుడు ఉసిరికల చంద్రశేఖర్, అకాడమీ కోశాధికారి గుండ వీరభద్రరావు, అకాడమీ ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక రవి, తదితరులు ఎంఎస్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యార్థులు సంగీతంతో పాటు సుప్రభాతం, విష్ణు సహస్రనామం, హనుమాన్ చాలీసా పఠనం చేస్తూ ఆధ్యాత్మికతను అలవాటు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు రవికుమార్, వంశీకృష్ణ, శారద, భానుహర్ష, మహేశ్వరరావు, బాలాజీస్వామి, విద్యార్థులు, తల్లిదండ్రులు, సంగీతాభిమానులు పాల్గొన్నారు.

నులి పురుగులను నిర్మూలిద్దాం..

● పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రభావం
● నేడు జాతీయ నులి పురుగుల నివారణ దినం
● 1 నుంచి 19 సంవత్సరాల్లోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ


పూసపాటిరేగ పీహెచ్‌సీ

పూసపాటిరేగ: నులి పురుగులు పిల్లలు శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రభావం చూపిస్తున్నాయి. పిల్లల్లో వచ్చే అనేక అనారోగ్య సమస్యలకు ప్రధాన కారణమవుతున్నాయి. పిల్లల కడుపులో ఉండే నులి పురుగులను తేలికగా తీసుకుంటే వారి ప్రాణానికే ప్రమాదం. ఈ పురుగులతో కలిగే ఆరోగ్య ఇబ్బందులు చిన్న పిల్లలు బయటకు చెప్పలేని పరిస్థితి. రక్తహీనత ఏర్పడి అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. కడుపునొప్పి, రక్తహీనత, వాంతులు, విరేచనాలు, అలసట, వికారం, బద్ధకం, నిరంతరం దగ్గు, దురద, నొప్పితో కూడిన మూత్ర విసర్జన, బరువు తగ్గిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అయితే కొన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లయితే నులి పురుగుల వ్యాప్తిని అరికట్టవచ్చు. బహిరంగ ప్రదేశాలలో మలవిసర్జన చేయకుండా వ్యక్తిగత మరుగుదొడ్డిని వినియోగించాలి. మల విసర్జన తర్వాత, భోజనానికి ముందు చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. చేతి వేళ్లు, గోర్లు పెరగకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. పరిశుభ్రమైన ఆహారం, సురక్షిత నీటిని తీసుకోవాలి. వీటికి తోడు ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగులను నివారించవచ్చు. రెండేళ్ల పిల్లలకు ఆల్బెండోజోల్ 200 ఎంజీ మాత్ర వేయాలి. మిగిలిన వయసు పిల్లలకు 400 ఎంజీ మాత్ర ఇవ్వవచ్చును.

పీహెచ్‌సీ	పిల్లల వివరాలు
పూసపాటిరేగ	11,500
రెల్లివలస	2700
గోవిందపురం	4000

శతశాతం పంపిణీ..



జాతీయ నులి పురుగుల నివారణ దినంలో భాగంగా అన్ని గ్రామాల్లో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తాం. పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కార్యక్రమం శతశాతం విజయవంతం అయ్యేలా సహకరించాలి.

– రాజేష్‌వర్మ, వైద్యాధికారి పూసపాటిరేగ పీహెచ్‌సీ

కార్మిక పక్షపాతి సీతారాం ఏచూరి


రాజాం: ఏచూరి సీతారాం చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు, తదితరులు


రాజాం సిటీ: ఏచూరికి జోహార్లు చెబుతున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

రాజాం: కార్మిక పక్షపాతి సీతారాం ఏచూరి అని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు కొనియాడారు. స్థానిక పట్టణంలోని రైస్‌మిల్లు వద్ద రాజాం రైస్‌మిల్లు కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బడుగు, కార్మిక, రైతు వర్గాల సంక్షేమం, అభివృద్ధికి నిత్యం పోరాటం సాగించిన వ్యక్తి ఏచూరి అని, ఆయన సేవలు వెలకట్టలేనివన్నారు. విద్యార్థి సంఘానికి నాయకత్వం వహించి, విద్యార్థుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేశారన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రైస్‌మిల్లు కార్మికుల యూనియన్ అధ్యక్షుడు పోరెడ్డి విశ్వనాథం, కార్యదర్శి కంచినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏచూరి సేవలు మరువలేనివి..

రాజాం సిటీ: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి, కామ్రేడ్ ఏచూరి సీతారాం సేవలు మరువలేనివని సీపీఎం మండల కన్వీనర్ సీహెచ్ రామ్మూర్తినాయుడు కొనియాడారు. మండల పరిధిలోని రాజయ్యపేటలో ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏచూరి మృతి వామపక్ష, ప్రజాతంత్ర ఉద్యమాలకు తీరని లోటన్నారు. మార్క్సిజాన్ని భారతీయ పరిస్థితులకు వర్తింపజేసి, విప్లవ శక్తులను కొత్తపుంతలు తొక్కించడానికి విరామమెరుగని కృషి చేశారన్నారు. శ్రీకాకుళం జిల్లా పైడిభీమవరంలో 2011లో రెడ్డీస్ లేబరేటరీ కార్మికుల 100 రోజుల పోరాటానికి ప్రత్యక్షంగా సంఘీభావం తెలిపారని గుర్తుచేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సత్యారావు, శ్రీనివాసరావు, తవుడు, సురేష్, లక్ష్మీపార్వతి, అపర్ణ, శంకరరావు, శివ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు విజయవంతం చేయండి

● కమిషనర్ పి.నల్లనయ్య


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ పి.నల్లనయ్య

విజయనగరం: కార్పొరేషన్ ప్రతిష్టను మరింత ఇనుమడింపజేసేందుకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలను విజయవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య పిలుపునిచ్చారు. అక్టోబర్ 2 గాంధీ జయంతి వరకు ప్రతిరోజూ నిర్వహించనున్న కార్యక్రమాలపై వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వచ్ఛభారత్ మిషన్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అమలు చేస్తున్న స్వచ్ఛతా హి సేవా - 2024 కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మంగళవారం ఉదయం ఏడు గంటలకు అయ్యకోనేరు వద్ద భారీ మానవహారం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, విద్య సంస్థలు, వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు, ప్రజలు పాల్గొనాలని కోరారు. అనంతరం అయ్యకోనేరును శుభ్రం చేయనున్నట్లు చెప్పారు. ప్రతిరోజూ కార్యక్రమాలు నిర్వహిస్తామని, ప్రజలు భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సహాయ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, ప్రజారోగ్యాధికారి కొండపల్లి సాంబమూర్తి, ఈఈ కె. శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, ఏసీపీ అమ్మాజీరావు, ఏఓ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాలు ధ్వంసం


ధ్వంసం చేసిన మద్యం బాటిళ్ల వద్ద పోలీస్ అధికారులు, సిబ్బంది

డెంకాడ: తనిఖీల్లో పట్టుబడిన మద్యం సీసాలను సోమవారం ధ్వంసం చేసినట్లు ఎస్సై ఎ. సన్యాసినాయుడు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏఈఎస్ అధికారి డి. విజయపతిరాజు, తదితరుల సమక్షంలో 251 మద్యం సీసాలను ధ్వంసం చేశామన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం


సతివాడలో ప్రచారం నిర్వహిస్తున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ, ఒమ్మి గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఇందూ జ్ఞాన వేదిక జిల్లా ప్రతినిధులు సోమవారం అవగాహన కల్పించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి ఊరేగింపు, విశిష్టతను ప్రజలకు వివరించారు. ప్రతి ఒక్కరూ భగవద్గీతను చదవాలని కోరారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి జిల్లా కమిటీ అధ్యక్షుడు శంకర్, సభ్యులు ప్రసాద్, నాయుడు, రాజప్పడు పాల్గొన్నారు.

కేసు నమోదు..

భోగాపురం: ఈనెల 14న స్థానిక జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదానికి సంబంధించి కేసు నమోదు చేశామని సీఐ ఎన్‌వీ ప్రభాకర్ సోమవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలం కేంద్రంలోని జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఓనుంపేట గ్రామానికి చెందిన కనకరాజు అనే వ్యక్తి తన సొంత పనుల నిమిత్తం జాతీయ రహదారి దాటుతుండగా.. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వెళ్తున్న ఆటో ఢీ కొనడంతో కనకరాజు కాలికి బలమైన గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు క్షతగాత్రుడ్ని విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడు కనకరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రకళకు రాష్ట్రస్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న మల్లా చంద్రకళ

విజయనగరం టౌన్: జిల్లాకు చెందిన మల్లా చంద్రకళకు ఏపీఎంపీఏ (ఆంధ్రప్రదేశ్ ఎంఈడీ ప్రోస్పరిటీస్ అసోసియేషన్) రాష్ట్రస్థాయి అవార్డు వరించింది. ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ డి.దయానందరెడ్డి చేతుల మీదుగా విజయవాడలో ఆదివారం ఆమె అవార్డు అందుకున్నారు. ఆమె ఆంధ్రాయూనివర్సిటీ ఎడ్యుకేషన్ విభాగంలో ఇంగ్లిష్ బోధకురాలిగా పనిచేస్తున్నారు. ఆమెకు పలువురు అభినందనలు తెలిపారు.

గ్లకోమాపై అపోహలు వీడాలి


మాట్లాడుతున్న డాక్టర్ అప్పారావు

బొబ్బిలి: కంటికి సంబంధించిన గ్లకోమా వ్యాధిపై నెలకొన్న అపోహలు వీడాలని నేత్రవైద్య నిపుణుడు కేవీ అప్పారావు అన్నారు. ఇటీవల తిరుపతిలో మూడురోజుల పాటు జరిగిన జాతీయ స్థాయి సమావేశానికి హాజరైన ఆయన.. అక్కడ గ్లకోమా వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై జరిగిన చర్చ ముఖ్యాంశాలను సోమవారం మీడియా సమావేశం నిర్వహించి, వివరించారు. కంటిలోని ఆప్టిక్ నరాలపై దెబ్బకొట్టే ఒక వైద్య పరిస్థితి గ్లకోమా అని, అంధత్వం రావడానికి గల కారణాల్లో గ్లకోమా ఒక కారణమే కానీ గ్లకోమా వల్లే శాశ్వత అంధత్వం కలుగుతుందన్నది అపోహ అని స్పష్టం చేశారు. దాదాపు ఆరు వేలకు పైగా గ్లకోమా శస్త్రచికిత్సలు చేసిన అనుభవంతో తాను సీనియర్, జూనియర్ వైద్యులకు కాన్ఫరెన్స్‌లో పలు సూచనలు చేయడం జరిగిందన్నారు. గ్లకోమా లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి, చికిత్స తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ఉన్న చికిత్సా విధానాలతో పూర్తి అంధత్వం రాకుండా చూసుకోవచ్చన్నారు. ఈ చికిత్సల్లో సక్సెస్ రేటు 50 శాతం నుంచి 99 శాతం వరకు పెరిగిన పరిస్థితులు ఉన్నాయన్నారు. సుగర్, బీపీ, గుండెజబ్బులున్న వారి చూపును గ్లకోమా త్వరగా తగ్గిస్తుందన్నారు. యాభై ఏళ్లు పైబడిన వారిలో 2 శాతం మందికి ఇది సాధారణంగా సోకుతుందన్నారు.

గొప్ప పోరాటయోధుడు బొజ్జా తారకం


బొజ్జా తారకం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

రాజాం సిటీ: గొప్ప పోరాటయోధుడు బొజ్జా తారకం అని బీఎస్పీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ బి.బుద్ధుడు కొనియాడారు. స్థానిక బీఎస్పీ కార్యాలయంలో బొజ్జా తారకం వర్ధంతి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన, ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులంతా కలిసి తారకం చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సుదీర్ఘకాలం పాటు పీడిత ప్రజలు, దళితుల పక్షాన ఆయన పోరాటం చేశారన్నారు. చుండూరు, కారంచేడు, లక్ష్మీపేట వంటి ఘటనల్లో దళితుల పక్షాన అలుపెరగని పోరాటం చేసి, న్యాయం జరిగేందుకు తోడ్పడ్డారన్నారు. కార్యక్రమంలో జె.నీలయ్య, తవిటయ్య, పాపారావు, అన్నారావు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ వైస్ ఎంపీపీ మృతి


మృతుడు సత్యం


సత్యం మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: మండల మాజీ వైస్ ఎంపీపీ చింత సత్యనారాయణ(సత్యం) సోమవారం మృతి చెందారు. మండలంలోని చుక్కవలస గ్రామానికి చెందిన ఆయన కొన్నేళ్ల పాటు సర్పంచ్ గాను, మండల వైస్ ఎంపీపీగా 1990 నుంచి 1995 వరకు పనిచేశారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆ గ్రామానికి వెళ్లి, సత్యం మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ఆయన మృతి గ్రామానికి తీరనిలోటు అని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, ఎంపీపీ ప్రతినిధి నర్సుపల్లి బాబ్జీరావు, జెడ్పీటీసీ ప్రతినిధి గర్భాపు రామారావు, పార్టీ మండల అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధులు నయం


ఆయుర్వేద వైద్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి సునీల్‌కుమార్

రేగిడి: ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయని ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి సునీల్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఖండ్యాం గ్రామంలో ఆయుర్వేద వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శిబిరానికి హాజరైన 35 మందికి ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఆయుర్వేద వైద్యం గొప్పతనం, ఫలితాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యోగా ఇన్‌స్ట్రక్టర్ రామకృష్ణ, ఏఎన్‌ఎం స్వాతి తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు


చౌడువాడలో సాగు చేస్తున్న వరిసాగు

● వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు

పూసపాటిరేగ :

రైతులు వరిసాగులో సరైన సస్యరక్షణ పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ శాఖాధికారులు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పంటకు ఆశించే తెగుళ్లను ముందస్తుగా గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని, లేదంటే నష్టాలు చవిచూడాల్సి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు రైతులను అప్రమత్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగులో ఉన్న వరి పంటకు ప్రస్తుతం తెగుళ్లు సోకే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇప్పటికే నెల్లిమర్ల నియోజకవర్గంలో పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం, నెల్లిమర్ల మండలాల్లో ఖరీఫ్ వరినాట్లు పూర్తి చేసి సస్యరక్షణ పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. ఈ పరిస్థితుల్లో వ్యవసాయాధికారులు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తూ అన్నదాతకు అండగా నిలుస్తున్నారు. పైరులో జింకు లోపం ఉన్నట్లయితే మూడు లేదా నాలుగు ఆకులతో ఈనె వాలిపోతుంది. నాటిన రెండు నుంచి ఆరు వారాలలో ముదరాకు మధ్యలో ఈనెలకు ఇరువైపులా తుప్పు రంగు మచ్చలేర్పడి ఆకు పెలుసుగా మారుతుంది. ఈ లక్షణాలు గుర్తించిన వెంటనే జింక్ సల్ఫేట్ ద్రావణం పిచికారీ చేయాలి.

కాండం తొలిచే పురుగు నివారణ

నారు మడి నుంచి పూత దశ వరకు వరి పంటలకు కాండం తొలిచే పురుగు ఆశించే అవకాశం ఉంటుంది. పిలక దశలో మొవ్వు చనిపోవడం , పూతదశలో తెల్ల కంకులు ఏర్పడడం జరుగుతుంది. దీని నివారణకు కార్టప్ హైడ్రోక్లోరిఫైరిపాస్ 2.5 ఎంఎల్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

సుడి దోమ

సుడి దోమ వ్యాపిస్తే వరి పంట ఎండిపోతుంది. నివారణకు లీటర్ నీటిలో ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు చొప్పున కలిపి పిచికారీ చేయాలి. అలాగే గట్టులపై కలుపు నివారించుకోవాలి.

ఆకు ఎండు తెగులు నివారణ

ఈ బ్యాక్టీరియా వల్ల ఆకు ఎండు తెగులు వస్తుంది. నత్రజని ఎరువులు తక్కువ పరిమాణంలో ఎక్కువ సార్లు వేసుకోవాలి. పొలం ఆరబెడుతూ నీటి తడులు తగ్గిస్తూ వేసుకోవాలి.

పొట్టకుళ్లు తెగులు

ఈ తెగులు ఆశిస్తే వెన్నులు పొట్టలోనే కుళ్లిపోతాయి. దీంతో పంటకు తీవ్ర నష్టం కలుగుతోంది. దీనిని నివారించేందుకు కార్బండజోమ్ 1.5 గ్రాముల లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలి. పొట్ట దశలో ఒకసారి , వారం రోజుల తర్వాత రెండోసారి పిచికారి చేయాలి.

నీటి యాజమాన్యం

పిలకలు వేసే దశలో పైరు దుబ్బు వేయడం పూర్తయ్యే వరకు పొలంలో 2 సెంటీమీటర్ల నీరు ఉండాలి. చిరుపొట్ట దశ, పూత దశలో 5 సెంటీమీటర్ల నీరు నిల్వ ఉండేలా చూసుకోవాలి. పంట పూర్తిగా వచ్చిన తర్వాత క్రమంగా నీరు తగ్గిస్తూ ఉండాలి.

ఎరువుల యాజమాన్యం

భూసార పరీక్షలకు అనుగుణంగా రసాయన, సేంద్రియ, జీవన ఎరువులు వాడి పైరుకు సమతుల్యంగా పోషకాలను అందించాలి. ఎకరాకు నత్రజని 96 కిలోలు, భాస్వరం 32 కిలోలు, పొటాష్ 32 కిలోలు అందేలా ఎరువులు వేసుకోవాల్సి ఉంటుంది.

యాజమాన్య పద్ధతులు పాటించాలి..



వరి పంటలో అధిక దిగుబడులు సాధించాలంటే సస్యరక్షణ చేపట్టాలి. నీటి యాజమాన్య పద్ధతులు, ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలి. చిన్న చిన్న మెలకువలు అనుసరించడం వల్ల పెట్టుబడులు తగ్గడంతో పాటు దిగుబడులు బాగుంటాయి. రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

– కె. నీలిమ , మండల వ్యవసాయాధికారి, పూసపాటిరేగ